క్లుప్తంగా

మొబైల్ రైస్ మిల్లుపై రైతుల ఆసక్తి



లోతట్టు గ్రామాల్లో సంచరిస్తున్న సంచార రైస్ మిల్లు

రాజవొమ్మంగి: మొబైల్ రైస్ మిల్లుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు.ఎన్ని బస్తాల ధాన్యం ఉన్నా ఇంటి వద్దకే వచ్చి ధాన్యం ఆడి బియ్యం , నూకలు, తౌడు తూకం వేసి అప్పగిస్తానని వాహన యజమాని హామీ ఇస్తున్నారు. ధాన్యాన్ని రైస్‌మిల్లుకు తరలించేందుకు అధిక శ్రమ, ఖర్చులు అవుతున్న నేపథ్యంలో మొబైల్ రైస్‌మిల్లు వద్దే ఆడించేందుకు స్థానికులు మొగ్గు చూపుతున్నారు.

ఆదివాసీ సభను విజయవంతం చేయాలి



ప్రచార జాతలో మాట్లాడుతున్న శ్రీను

ఎటపాక: భద్రాచలంలో ఈనెల 11న జరుగనున్న జై ఆదివాసీ భారీ బహిరంగ సభ ప్రచార జాత కార్యక్రమం శుక్రవారం కృష్ణవరంలో జరిగింది. ఈసందర్భంగా ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు కుంజా శ్రీను మాట్లాడుతూ గిరిజనేతరులను ఎస్టీ జాబితాలో కలిపే కుట్రలు అడ్డుకుంటామన్నారు. భద్రాచలంలో జరుగనున్న సభను ఆదివాసీలంతా విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో రాఘవయ్య,మల్లికార్జున్,నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు



ఆటలాడుతున్న విద్యార్థులు

డుంబ్రిగుడ: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక శాఖాగ్రంథాలయంలో శుక్రవారం విద్యార్థినీవిద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశాఖ అధికారి సునీత మాట్లాడుతూ ఈ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సంబరాలను విజయవంతం చేయండి



వారపు సంతలో ప్రచారం చేస్తున్న గిరిజన సంఘం నాయకులు

డుంబ్రిగుడ: మండలంలోని అరకులో జరిగే ఆదివాసీ సాంస్కృతిక సంబరాలను, 8వ రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని కోరుతూ అరకు వారపు సంతలో శుక్రవారం గిరిజన సంఘం ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ నెల 6,7,8 తేదీల్లో ఈ సభలు జరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు టి.సూర్యనాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా ఆశాజ్యోతి బాధ్యతల స్వీకరణ



ఆశాజ్యోతికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జెడ్పీటీసీ

చింతపల్లి: ఎంపీడీవోగా ఆశాజ్యోతి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేస్తున్న లాలం సీతయ్యకు నాతవరానికి బదిలీ అయింది. పరవాడ ఏవోగా పనిచేస్తున్న ఆశాజ్యోతిని పూర్తి స్థాయి ఎంపీడీవోగా ఇక్కడ నియమించారు.బాధ్యతలు చేపట్టిన ఆమెకు జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య,స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత,లాలం సీతయ్య పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

తాగునీటి సౌకర్యం కల్పనకు సత్వర చర్యలు

అరకులోయ రూరల్: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు దృష్టి సారించాలని అరకులోయ ఎంపీపీ రంజపల్లి ఉషారాణి కోరారు. పల్లెల్లో అధికారులు పర్యటించి వినియోగంలోకి లేని బోర్లకు మరమ్మతులు చేపట్టాలన్నారు. తాగునీటి సౌకర్యం కల్పించాలని పలు గ్రామాల నుంచి వినతులు వస్తున్నందున అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన



ముసూరు గ్రామంలో ప్రభుత్వ పథకాలను లబ్ధిదారుడికి వివరిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి



మత్స్యపురంలో పథకాలపై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే పాల్గుణ, చిత్రంలో ఎంపీపీ రాజుబాబు,నాయకులు

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ధనలక్ష్మి

మారేడుమిల్లి : ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన కొనసాగుతోందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మారేడుమిల్లి పంచాయతీ పరిధిలోని ముసూరు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. గ్రామంలో 150 గడపలను ఆమె సందర్శించారు. ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాలు అమలు తీరు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సమస్యల పరిష్కారం కోసం ప్రజా ప్రతినిధుల వద్దకు ప్రజలు వెళ్లే వారని, నేడు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ పాలనలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఎమ్మెల్యేలే ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకుంటున్నారని చెప్పారు. పార్టీలకతీతంగా అన్ని వర్గాలకు పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్టు తెలిపారు. గిరిజన ప్రాంతాలలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తోందని చెప్పారు. పలు సమస్యలను గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సార్ల లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యుడు గొర్లె బాలాజీ బాబు, వైస్ ఎంపీపీ లక్కోండ రవికుమార్, కో–ఆప్షన్ సభ్యుడు గురుకు ధర్మరాజు, సర్పంచ్ కొండా జాకబ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సత్తి సత్యనారాయణ రెడ్డి, కార్యదర్శి బొడ్డేటి గంగరాజు, కాసగాని సురేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ సంక్షేమ పథకాలు
– అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

హుకుంపేట: రాష్ట్రంలో ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని మత్స్యపురం పంచాయతీ కేంద్రంతో పాటు తురకలమెట్ట, కోటగరువు, గున్నమామిడి,గండువా గరువు గ్రామల్లో స్థానిక నాయకులతో కలిసి శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనకు గిరిజనులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఆయా గ్రామాల్లో 165 గడపలను సందర్శించి, అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పాలనలో గ్రామాల్లో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ప్రతి పేద కుటుంబానికి పథకాలు అందిస్తూ అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకుంటోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కూడా రాజుబాబు, సొసైటీ బ్యాంకు చైర్మన్ రామకృష్ణ,సీడీపీవో బాలచంద్రమణి దేవి,సర్పంచ్‌లు పూజరి మేరి, అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు కిల్లో మీనా,నాయకులు సుబ్బారావు,సొంబ,కామరాజు,వెంకట్,చప్పలి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే అభివృద్ధి

ఎంపీపీ శెట్టి నీలవేణి



సర్వసభ్య సమావేశంలోని మాట్లాడుతున్న ఎంపీపీ శెట్టి నీలవేణి



పాల్గొన్న అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు

అనంతగిరి: అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతోనే మండల అభివృద్ధి సాధ్యపడుతుందని ఎంపీపీ శెట్టి నీలవేణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శెట్టి నీలవేణి అధ్యక్షతన శుక్రవారం సర్వసభ్య సమావేశం జరిగింది. ముందుగా మండలంలోని జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలను అన్నిశాఖల అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ శెట్టి నీలవేణి మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాలు, శంకుస్థాపనలకు సంబంధించిన సమాచారం తప్పనిసరిగా అందించాలన్నారు. ట్రైబల్ వెల్ఫేర్, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు, గ్రావెల్ రోడ్లు, వంతెనలు నిర్మాణాల పనులను వేగవంతం చేయాలని సూచించారు. వేసవి నేపథ్యంలోని తాగునీటి సమస్య తలెత్తకుండా ఆర్‌డబ్ల్యూఎస్‌శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపారు. జెడ్పీటీసీ దీసరి గంగరాజు మాట్లాడుతూ ఎగువశోభ తారు రోడ్డు నిర్మాణాన్ని నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, ఆ మేరకు అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలోని ఎంపీడీవో కుమార్, ఏవో లక్ష్మీనారయణ, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యంత్ర సేవా పథకంతో రైతులకు మేలు

- **అడ్డతీగల ఏడీఏ సావిత్రి**



అడ్డతీగల: రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన యంత్ర సేవా పథకంతో రైతులకు ఎంతో మేలు జరుగుతోందని అడ్డతీగల సహాయ వ్యవసాయ సంచాలకులు కె.సావిత్రి తెలిపారు. ఈ పథకం ద్వారా వివిధ యంత్ర పరికరాలు అందుబాటులోకి తీసుకొచ్చినట్టు చెప్పారు. అడ్డతీగల సబ్‌డివిజన్‌లోని రెండు మండలాల్లో 8 కస్టమర్ హైరింగ్ సెంటర్ల ద్వారా 16 యంత్ర పరికరాలు అందిస్తున్నట్టు ఆమె చెప్పారు. 40 శాతం రాయితీ కాగా, 50 శాతం బ్యాంకు రుణం ,మరో 10 శాతం లబ్ధిదారుల వాటాగా చెల్లించాలని తెలిపారు. అడ్డతీగల మండలం గొండోలు,దుశ్చర్తి, తుంగమడుగుల,రాయపల్లి రైతు భరోసా కేంద్రాల పరిధిలోని రైతు గ్రూపులకు వీటిని మంజూరు చేసినట్టు చెప్పారు. వై.రామవరం మండలం చవిటిదిబ్బలు,దాలిపాడు, పనసలపాలెం , కె.ఎర్రగొండ రైతు భరోసా కేంద్రాల్లోని కస్టమర్ హైరింగ్ సెంటర్ల ద్వారా యంత్ర పరికరాలు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

సప్లిమెంటరీ పరీక్షలకు ఆరుగురు గైర్హాజరు



పెదబయలులో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

రాజవొమ్మంగి : స్థానిక అల్లూరిసీతారాజు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రంలో నిర్వహిస్తున్న పది సప్లిమెంటరీ పరీక్షలకు తొలిరోజు ఆరుగురు గైర్హాజరు అయినట్టు ఎంఈవో తాతబ్బాయిదొర తెలిపారు. మొత్తం 53 మంది విద్యార్థినీవిద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 47 మంది పరీక్షలు రాశారన్నారు.

ప్రశాంతంగా పరీక్షలు

పెదబయలు: మండలంలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్ష శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. గురుకుల పాఠశాల కేంద్రంలో జరిగిన తెలుగు పరీక్షకు 132 మంది విద్యార్థులకు హాజరయ్యారని కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ శంకరరావు తెలిపారు. కేంద్రంలో అన్ని సౌకర్యాలు కల్పించినట్టు చెప్పారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సత్యనారాయణ

మాకవరపాలెం: ప్రజా సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ రుత్తల సత్యనారాయణ ఆదేశించారు. ఎంపీపీ అధ్యక్షతన శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారికీ చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం శాఖల వారీగా అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. సభ్యులు స్థానిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో బూరుగుపాలెం ఎంపీటీసీ సభ్యుడు రుత్తల యర్రాపాత్రుడు కొండలఅగ్రహారం ప్రాంత విషయమై మాట్లాడుతుండగా సర్పంచ్ పోలిరెడ్డి అచ్చియ్యమ్మ అడ్డుతగిలారు. తమ గ్రామానికి సంబంధించి మీరు మాట్లాడటం ఏంటని ప్రశ్నించారు. దీంతో వైఎస్సార్‌సీపీ, టీడీపీ సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో ఎంపీపీ కలుగజేసుకుని ఏ గ్రామానికి సంబంధించి వారే మాట్లాడాలని చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. జెడ్పీటీసీ సభ్యురాలు పెట్ల సత్యవేణి, వైస్ ఎంపీపీ లు లక్ష్మి, రాజారావు, ఎంపీడీవో అరుణశ్రీ, తహసీల్దార్ ప్రసాదరావు పాల్గొన్నారు.

సూర్యనారాయణుడికి శాంతి హోమం

నేడు చినజీయర్ స్వామి చేతుల మీదుగా విగ్రహాల ప్రతిష్ట



శాంతి హోమం చేస్తున్న వేదపండితులు

అనకాపల్లిటౌన్ : గ్రేటర్ విశాఖ విలీన గ్రామమైన రాజుపాలెం శ్రీ సూర్యనారాయణస్వామి ఆలయంలో మూడురోజులుగా జరుగుతున్న ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు డి.కల్యాణ్‌కుమార్, వేదపండితులు ఆరాధన యాగశాలలో శాంతి హోమం నిర్వహించారు. హోమాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అంతకుముందు ఉత్సవ విగ్రహాలకు వేదపండితులు విశేష పూజలు జరిపారు. శనివారం ఉదయం చినజీయర్‌స్వామి చేతుల మీదుగా మహాలక్ష్మి సమేత వైకుంఠ నారాయణ, శ్రీ వేంకటేశ్వరస్వామి, లక్ష్మీ నారాయణ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ కొణతాల బాబూరావు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జి.రామకోటేశ్వరరావు, రామకృష్ణ, నర్సింగరావు, వెంకటరమణ, చిరంజీవి, రామకోటి, వరహాలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యం అత్యంత శ్రేష్టం



వివిధ రాష్ట్రాల ఆయుర్వేద వైద్యులతో సుందర్‌రాజ్ పెరుమాళ్

అనకాపల్లిటౌన్ : ఆయుర్వేద వైద్యంలో వివిధ రకాలైన వ్యాధులకు ఉచితంగా మందులు పంపిణీ చేయడంతోపాటు, ఆయుర్వేద వైద్యులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆరోగ్యధాత్రి ఆయుర్వేద పరిశోధన సంస్థ వ్యవస్థాపకుడు సుందర్‌రాజ్ పెరుమాళ్ తెలిపారు. మండలంలోని కోడూరు పరిశోధనా కేంద్రంలో ఐదు రోజులుగా నిర్వహించిన వివిధ రాష్ట్రాల ఆయుర్వేద వైద్యుల శిక్షణాకార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమిళనాడు, కర్ణాటక, ఒరిస్సా, తెలంగాణాతోపాటు మన రాష్ట్రానికి చెందిన 50 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చి, సర్టిఫికెట్లు అందజేసినట్లు తెలిపారు. వామన కర్మ, విద్ధ కర్మ, నేత్రక్రియా కల్పం వంటి అతి ప్రాచీన చికిత్స ప్రక్రియలపై శిక్షణ ఇచ్చినట్లు వెల్లడించారు. బ్రహ్మముహూర్తంలో నిద్ర లేవడం, యోగాభ్యాసం, ప్రాణయామం, ధ్యానం, ఆయుర్వేద దినచర్య వరకూ ప్రతి అంశాన్ని ప్రత్యక్షంగా వివరించినట్లు తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



శివనగరంలో సమస్యలను తెలుసుకుంటున్న జెడ్పీటీసీ మత్స్యలింగం

డుంబ్రిగుడ: అర్హులందరికీ రాష్ట్రప్రభుత్వం సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్టు హుకుంపేట జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్యలింగం తెలిపారు. ప్రభుత్వ పథకాలపై కించుమండ పంచాయతీ శివనగరం,శుక్రపుట్టు,కితలంగి పంచాయతీల్లోని ప్రజలకు శుక్రవారం ఆయన అవగాహన కల్పించారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వాటిని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు సత్తిబాబు, నాయకులు చిన్నయ్య, మోహన్, మద్దు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గూడలో క్రికెట్ టోర్నమెంట్



క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొన్న క్రీడా కారులు

హుకుంపేట: మండలంలోని గూడ పంచాయతీ కేంద్రంలో స్థానిక ఉద్యోగులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో సమ్మర్ స్పెషల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. ఈ టోర్నమెంట్‌ను శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ నేత కె.కోటిబాబు,నాయకులు ప్రారంభించారు.విజేతలకు ప్రథమ, ద్వితీయ బహుమతులుగా రూ.10,వేలు, రూ.5వేలు అందజేయనున్నట్టు కోటిబాబు తెలిపారు.

రైతు భరోసా నగదు జమ

గంగవరం: మండలంలో 17 గ్రామపంచాయతీల్లో 4,584మంది రైతులు రైతుభరోసా పథకం ద్వారా లబ్ధి పొందారని మండల వ్యవసాయాధికారి కె.విశ్వనాథ్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. రూ.2,60,42,000 నగదు రైతుల ఖాతాలో జమ చేసినట్టు చెప్పారు. 4169మంది సొంతభూమి కలిగిన రైతులకు, అలాగే ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు పొందిన 415మందికి రైతు భరోసా పథకం వర్తించిందని తెలిపారు. రైతులు తమ బ్యాంక్ ఖాతాలను పరిశీలించుకోవాలని, సమస్యలుంటే సమీప సచివాలయంలో వ్యవసాయ సహాయకులను సంప్రదించాలన్నారు.

రైతులకు అందుబాటులో పశువైద్యం



సమావేశంలో పశువైద్యాధికారి మౌనిక

కె.కోటపాడు: వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల ద్వారా పశువైద్యం సకాలంలో అందాలని చౌడువాడ పశువైద్యాధికారి మౌనిక తెలిపారు. ఇటీవల కడప నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చిన ఆమె శుక్రవారం ఆర్బీకే పశువైద్య సహాయకులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం రైతాంగానికి అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను రైతులకు సకాలంలో వివరించడంతోపాటు వాటిని రైతులు పొందేలా చర్యలను తీసుకోవాలని సూచించారు. వైఎస్సార్ పశుబీమా పథకంలో చేర్పించాలన్నారు. రాయితీ గడ్డి, టీఎంఆర్ దాణాను ఇస్తున్నట్లు తెలిపారు.

పోటీ పరీక్షలతో ప్రతిభ వెలికితీత



వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న సౌమ్య

కె.కోటపాడు: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ వెలికి తీయడానికి పోటీ పరీక్షలు దోహదపడతాయని గ్రంథపాలకురాలు సౌమ్య తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శుక్రవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో పర్యావరణం–పచ్చదనం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఈ నెల 11న బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిక్షణ



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

పెదబయలు: మండల కేంద్రంలో 22 రోజుల పాటు నిర్వహించిన వేసవి విజ్ఞాన వినోద కార్యక్రమం విద్యార్థులకు ఎంతో ఉపయోగపడిందని గిరిజన ఉద్యోగుల సంఘ మండల అధ్యక్షుడు చెండా బాలకృష్ణ, సాగేని లక్ష్మీనారాయణ అన్నారు. గత నెల 20 నుంచి జూన్ 2 తేదీ వరకు స్థానిక గిరిజన ఉద్యోగ సంఘం భవనంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన వినోద కార్యక్రమం ముగిసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. ముఖ్యంగా విద్యార్థులకు సమయపాలన, నైతిక విలువలు,అందరితో కలుపుగోలుగా ఉండడం, సెల్ ఫోన్, టీవీలు మితిమీరి వినియోగించడం వల్ల జరిగే నష్టాలు, ఆరోగ్యం తదితర అంశాలపై అవగాహన కల్పించినట్టు చెప్పారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతుల అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాదరావు, ఆదినారాయణ, అప్పన్న,సాంబమూర్తి,మత్స్యలింగం, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు మృతికి సంతాపం



కామరాజు దొర (ఫైల్)

గంగవరం: మోహనాపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు కోసుకామరాజుదొర(56) గుండెపోటుతో శుక్రవారం గంగవరంలోమృతి చెందారు. కామరాజు మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు. స్థానిక సర్పంచ్ కలుముల అక్కమ్మ, వైస్ ఎంపీపీ కుంజం గంగాదేవి, ఉపసర్పంచ్ పరదా వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ అరకు పార్లమెంట్ జిల్లా కార్యదర్శి దిండిబాబీ, మాజీ ఎంపీపీ తీగలప్రభ, మాజీ ఎంపీటీసీ కోసు బుల్లియమ్మ, మండల విద్యాశాఖాధికారి వై.మల్లేశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా నాయకులు కె.కృష్ణ, వెంకన్నదొర, మండలఅధ్యక్షకార్యదర్శులు రఘుబాబు,రాంబాబు, మోహనాపురం ఆశ్రమపాఠశాల హెచ్ఎం బాలరాజు, పలు పాఠశాలల ఉపాధ్యాయులు నివాళులర్పించారు.

రాయితీ విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలి



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ సన్యాసమ్మ

చింతపల్లి రూరల్: ప్రభుత్వం 90శాతం రాయితీపై పంపిణీ చేస్తున్న విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని బెన్నవరం సర్పంచ్ బచ్చుల సన్యాసమ్మ తెలిపారు. మండలంలోని బెన్నవరం రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం విత్తనాల పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సన్యాసమ్మ మాట్లాడుతూ రైతులు విత్తనాల కోసం మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా ఆర్బీకేలో పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సోని,వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గెమ్మెలి రామన్న తదితరులు పాల్గొన్నారు.

95 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి



యార్లగడ్డలో వృద్ధురాలికు పింఛన్ అందిస్తున్న వలంటీరు నైని బాబి, కనకరాజు

వై.రామవరం: మండలంలో మొత్తం 3,232 మంది వైఎస్సార్ పింఛన్ లబ్ధిదారులుండగా శుక్రవారం నాటికి 95 శాతం మందికి పంపిణీ పూర్తయినట్టు స్థానిక పంచాయతీ కార్యదర్శి మధుసూధనరాజు తెలిపారు. మండలంలోని యార్లగడ్డ సచివాలయం పరిధిలోని యార్లగడ్డ గ్రామంలో వెలుగూరి లక్ష్మమ్మ అనే 95 ఏళ్ల వృద్ధురాలికి గ్రామ వలంటీరు నైని బాబి, మండల సచివాలయ కన్వీనర్ కరణం కనకరాజు శుక్రవారం పింఛన్ అందజేశారు. తన లాంటి వారికి సేవలు అందిస్తున్న వలంటీర్లకు, వైస్సార్‌సీపీ నాయకులకు ఆ వృద్ధురాలు కృతజ్ఞతలు తెలిపింది.

వెంకన్న ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం



శంకుస్థాన చేస్తున్న అప్పలరాజు, నాగమణి దంపతులు

జి.మాడుగుల: మండలంలోని సొలభం పంచాయతీ తోటలగొందిలో వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి శుక్రవారం విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి కూడా రామకృష్ణ పరమహంస, జిల్లా ధర్మప్రచార ప్రముఖ్ రీమెలి అప్పలరాజు ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. ఆలయ నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం, దేవదాయ ధర్మాదాయ శాఖ నిధులు మంజూరు చేసినట్టు వారు చెప్పారు. అప్పలరాజు, నాగమణి దంపతులు భక్తిశ్రద్ధలతో శంకుస్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పొల్లన్న, రీమెలి రామకృష్ణగురుస్వామి, వివిధ దేవాలయాల పూజారులు తలారి రాంబాబు, సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటేందుకు ప్రణాళిక



వెలుగు ఏపీఎం మర్రి లక్ష్మి

నాతవరం: ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంతో పాటు ఖాళీ స్థలాల్లో మొక్కలు నాట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని వెలుగు ఏపీఎం మర్రి లక్ష్మి తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం వీవోలు, వెలుగు సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మండల వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయాలు, పాఠశాలలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో మొక్కలు నాటుతామన్నారు. దీనికి సంబంధించి మండల వ్యాప్తంగా ఖాళీ ప్రదేశాలను గుర్తిస్తున్నామన్నారు. వీటిని నాటడం వల్ల కలిగే ప్రయోజనాలపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తామన్నారు. డ్వాక్రా సంఘాలకు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలపై వివరిస్తున్నామన్నారు.